క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతం



నాతవలసలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

డెంకాడ: మండలంలోని నాతవలస అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్, సర్పంచ్ ఆవాల లక్ష్మి, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి..



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న భీమ్ యువజన సంఘ సభ్యులు

భోగాపురం: శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన భీమ్ యువజన సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సురేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ, శ్మశానవాటికలో ఆక్రమణలు చోటుచేసుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించలేక పోతున్నామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, శ్మశాన స్థలంలో బోరు, షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో భీమ్ యువజన సంఘ సభ్యులు మద్దెల గుర్నాథరావు, శ్రీను, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల వద్దనే వైద్యసేవలు



భోగాపురంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భోగాపురం: గ్రామీణులందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దనే వైద్యసేవలు అందిస్తున్నట్లు పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని తోటవీధిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, డీఈఓ హేమంత్, హెల్త్ అసిస్టెంట్ రమణ, పురుషోత్తం, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


రెండు నెలలైనా అధికారులకు పట్టదా..!



కుంగిపోయిన గుంకలాం రహదారి

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామానికి వెళ్లే రహదారి కుంగిపోయి సుమారు రెండు నెలలవుతున్నా సంబంధిత అధికారులకు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం శోచనీయం. దీంతో గ్రామం నుంచి విజయనగరానికి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని సర్పంచ్ కునుకు నాగరాజు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పాలిథిన్ ఉత్పత్తుల విక్రయాలపై పర్యవేక్షణ



పాలిథిన్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంటున్న ప్రజారోగ్య విభాగ సిబ్బంది

విజయనగరం: నగరంలో పాలిథిన్ ఉత్పత్తుల విక్రయాలపై (సింగిల్‌యూజ్ ప్లాస్టిక్) నిరంతర పర్యవేక్షణ ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ప్రజారోగ్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సిబ్బంది కార్పొరేషన్ పరిధిలోని ఒకటో నంబర్ సర్కిల్‌లో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, పాలిథిన్ కవర్లను స్వాధీనపరుచుకున్నారు. మరోసారి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సిబ్బంది, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘గ్రామ సందర్శన’

● మండల ప్రత్యేకాధికారి సుధారాణి



భోగాపురం : గ్రామసందర్శన కార్యక్రమంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులకు తెలియజేస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ

భోగాపురం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి సుధారాణి అన్నారు. ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పోలిపల్లి గ్రామంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, గ్రామపెద్ద కర్రోతు సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న శ్మశానవాటికల్లో సర్వే చేపట్టాలన్నారు. అలాగే డ్రైనేజీ పనులు, కుళాయి పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనాలు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న భవనాలను తొలగించి, కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలను తొలగించి వేరేచోట కొత్త భవనం నిర్మించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మండల ప్రత్యేకాధికారి స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సురేష్, ఎంఈఓ రమణమూర్తి, సీడీపీఓ ఎస్తేరు రాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాతవలసలో..

డెంకాడ: గ్రామ సందర్శన కార్యక్రమంలో తెలుసుకున్న సమస్యలను వెంటవెంటనే పరిష్కరిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని నాతవలసలో గ్రామసందర్శన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్, సర్పంచ్ ఆవాల లక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ పి.పద్మావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా..

విజయనగరం రూరల్: సమస్యలను గుర్తించి పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహించాల్సిన గ్రామసందర్శన కార్యక్రమాన్ని అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. మండలంలోని చిల్లపేటలో నిర్వహించిన గ్రామసందర్శనలో పాల్గొన్న అధికారులు మధ్యాహ్నం 12 గంటలకే తిరుగుముఖం పట్టారు. మండల ప్రత్యేక అధికారి అరుణకుమారి, తహసీల్దార్ కూర్మనాథ్, ఎంపీడీఓ చంద్రకళ స్థానిక పాఠశాలను సందర్శించి వెళ్లిపోయారు. వీరివెంటే మిగతా అధికారులు కూడా వెళ్లిపోవడంతో విమర్శలు వినిపించాయి. సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామంలో ఉండాల్సిన అధికారులు 12 గంటలకే వెళ్లిపోవడంతో ఈ కార్యక్రమం ఎందుకు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నించారు. స్థానిక సర్పంచ్ బూర్లి దేవీప్రసన్న మాత్రం గ్రామంలోని కొన్ని సమస్యలపై ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్య, వైద్యం, వెలుగు, ఉపాధి, విద్యుత్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



డెంకాడ: నాతవలస పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



విజయనగరం రూరల్: ప్రత్యేక అధికారికి గ్రామంలోని సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ దేవీప్రసన్న

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

● మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గరికిపేట గ్రామంలో గురువారం గ్రామ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో పర్యటించి హౌసింగ్ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఇళ్ల నిర్మాణాల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేసేలా చైతన్యపరచాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టంపై ఆరా తీశారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని.. వైద్యారోగ్య, ఇతర సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ సుదర్శన్, గ్రామ పెద్దలు ఉమ, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

● మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి

పూసపాటిరేగ: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి ఆదేశించారు. మండలంలోని చౌడువాడలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు అధికారులు గ్రామంలో పర్యటించి వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం. రాధిక, మండల ఇంజినీరింగ్ అధికారులు మురళీమోహన్, శ్రీనివాసరావు, ఆర్ అండ్‌బీ ఏఈ మీనాపట్నాయక్, పశువైద్యాధికారి రాజేశ్వరి, ఏపీఓ రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న ప్రత్యేకాధికారి, తదితరులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రహదారి విస్తరణ, విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లంకాపట్నం పరిధిలో గల 11కేవీ ఫీడర్ పరిధిలో గల సుబ్రహ్మణ్యస్వామి టెంపుల్ ఏరియా, లక్ష్మీగణపతికాలనీ, కొత్తపేట గొల్లవీధి, సాకేటివీధి, కూరాకుల వీధి, స్వీపర్ కాలనీ, కుమ్మరవీధి, సాలివీధి, స్వర్గధామం, లంకాపట్నం, శుద్ధవీధి, హుకుంపేట, ప్రేమ సమాజం ఎదురు ప్రాంతల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదేవిధంగా నగరంలోని కొత్తపేట నీళ్ల ట్యాంక్ నుంచి అంబటిసత్రం జంక్షన్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతన లైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు చిన్నపల్లివారివీధి, కోలగట్ల వారివీధి, 2 టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియా, కొణిసి వీధి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోతాదు మించకూడదు..

డెంకాడ: మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకూడదని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరంలో గురువారం ఇండ్ గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ పొందాలంటే ప్రామాణికమైన నిర్దేశిత రసాయన, పురుగు మందులను మాత్రమే వినియోగించాలన్నారు. మొదటి దఫాలో 25 కిలోల డీఏపీ, 20 కిలోల యూరియా ఆఖరి దమ్ములో వేయాలన్నారు. కలుపుతీసిన వారం రోజుల్లో రెండో దఫాలో 20 కిలోల యూరియా వేయాలని సూచించారు. చిరుపొట్ట దశలో 20 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వాడాలన్నారు. సీఈఓ ప్రభాకర్, ఎఫ్‌పీఓ రామాంజనేయ, గ్రామపెద్దలు పిట్టా అప్పారావు, ఏఈఓ బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.



సింగవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి పి.నిర్మల

చెత్తను తొలగించారు..

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామంలో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోవడంపై సాక్షి దినపత్రికలో ‘ఇక్కడే ఎందుకిలా’ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్తను గురువారం తొలగించారు. అలాగే సామూహిక మరుగుదొడ్లకు కూడా మరమ్మతులు చేపడతామని పంచాయతీ అధికారులు చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్...



రోడ్డుపై చెత్తా చెదారాలను తొలగిస్తున్న అధికారులు

సహాయక చర్యలు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం పూల్‌బాగ్: తుఫాన్ వల్ల కలిగిన నష్టంపై విచారణ చేపట్టి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తుఫాన్ వల్ల జిల్లాలో పెద్దగా నష్టం జరగలేదని కలెక్టర్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రామభద్రపురం మండలం పారాది వద్ద రూ. కోటితో కట్టిన కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పూసపాటిరేగ మండలంలో కల్వర్టు కొట్టుకుపోయిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పంట పొలాలు, రోడ్లు పాడయ్యాయని చెప్పారు. అలాగే విజయనగరం పట్టణంలో రోడ్లపై గోతులేర్పడ్డాయన్నారు. బొబ్బిలి పట్టణంలో బలిజిపేటకు వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిలిచిపోవడంతో రోడ్లు పాడయ్యాయని చెప్పారు. వాణిజ్య, ఉద్యాన పంటలకు చాలా నష్టం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: నగర పరిధిలో కుళాయి కనెక్షన్లు అవసరమైన వారు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేసి, రసీదును పొందాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుళాయి కనెక్షన్‌లకు అవసరమైన దరఖాస్తులను ఆయా సచివాలయాల్లో మాత్రమే లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు అప్పటివరకు పూర్తిగా చెల్లించిన ఆస్తిపన్ను కాపీని ఆధార్ కార్డు నకళ్లను జత చేయాలని తెలిపారు. అపార్ట్‌మెంట్, గృహసముదాయాలకు అవసరమైన కుళాయి కనెక్షన్ కోసం ప్లాన్ అప్రూవల్ కాపీ జతచేయాల్సి ఉంటుందన్నారు. సచివాలయం ద్వారా వచ్చిన కుళాయి కనెక్షన్ దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటాయని తెలిపారు. ఎటువంటి దళారులను నమ్మవద్దని స్పష్టం చేశారు. రూ. 200 కుళాయి కనెక్షన్లు పొందాలనుకునే వారు రూ.200 నగదు చెల్లిస్తూ, కుళాయి ఏర్పాటుకు అవసరమైన పైపులు, ఇతర సామాగ్రి కోసం అవసరమైన చెల్లింపులు చేసుకోవాలనారు. అదేవిధంగా ఆరు వేల రూపాయల కనెక్షన్లు పొందాలనుకునేవారు రూ. 6 వేల నగదుతో పాటు అంచనా రుసుంను పైపులు, ఇతర సామాగ్రి కోసం అవసరమైన మొత్తాన్ని చెల్లించాలన్నారు.

కొనసాగుతున్న బకాయి వసూళ్లు



దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

విజయనగరం: నగరపాలక సంస్థకు చెందిన దుకాణాల అద్దె త్వరితగతిన చెల్లించాలని కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. రెవెన్యూ అధికారి పి. శ్రీనివాసరావు, తదితరులు గురువారం కూడా నగరంలో పర్యటించి ఎనిమిది దుకాణాలను సీజ్ చేశారు. గురువారం ఒక్క రోజే 21.50 లక్షల రూపాయలు సేకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, కిరణ్‌సాయి ప్రసాద్, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవండి

● ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతిరాజు



తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వస్త్ర వ్యాపారులు

విజయనగరం: వరద బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతిరాజు విజ్ఞప్తి చేశారు. పట్టణానికి చెందిన బాలాజీ టెక్స్‌టైల్స్ మార్కెట్ వర్తక సంఘం విజయడవాడ వరద బాధితుల కోసం రూ. లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. గురువారం ఉదయం స్థానిక అశోక్ బంగ్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డెపు వెంకటరావు చేతుల మీదుగా ఎమ్మెల్యే చెక్కు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు సామాజిక బాధ్యతగా స్పందించి లక్ష రూపాయల సహాయాన్ని అందించిన బాలాజీ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులకు ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో ఉన్న విజయవాడ వాసులను ఆదుకునేందుకు వ్యాపార సంస్థల ప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డెపు వెంకటరావు, పూర్వపు అధ్యక్షుడు సావరమల్ చౌదరి, ప్రతినిధులు నిర్మల్‌కుమార్ జైన్, వేలు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారిగా ఆనందరావు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సీనియర్ వైద్యాధికారిగా మాతల ఆనందరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ, ఆయుర్వేదంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. పైల్స్ , భగందర, ఫిషర్ వ్యాధులకు క్షార సూత్ర చికిత్స అందించడం జరుగుతుందన్నారు. నడుం నొప్పికి వక్షికర్మ చేయబడునని తెలిపారు. రుమటైడ్ ఆర్థరైటీస్, ఆస్టోయో ఆర్థరైటీస్ వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి వైద్యం ఉందని చెప్పారు. అలాగే జీర్ణకోశ వ్యాధులు, బీపీ, సుగర్, ఊబకాయం, కిడ్నీలో రాళ్లకు కూడా మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.



ఆనందరావుకు అభినందనలు తెలుపుతున్న హోమియో వైద్యాధికారి వరప్రసాద్, తదితరులు

అవగాహన తప్పనిసరి

● క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: క్షయ, హెచ్‌ఐవీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌జైలులో హెచ్‌ఐవీ, క్షయ, లెప్రసీ వ్యాధులపై లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ సాక్షి గోపాలరావు, ఎస్‌టీఐ కౌన్సిలర్ డి. త్రినాథ, క్షయ నివారణశాఖ సూపర్‌వైజర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరావు

సమస్యల పరిష్కారానికి చర్యలు



వార్డు పర్యటనలో సమస్యలను గుర్తిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, తదితరులు

● కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

విజయనగరం: వార్డు పర్యటనల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు అన్నారు. నగరంలోని 8వ డివిజన్ గురాచారి వీధిలో గురువారం వార్డు పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా గురాచారి వీధి, లక్కపందిరి వీధి, ఆనందనగర్, మఠం వీధి, తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండడానికి గమనించారు. చెత్తాచెదారాలను తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పారిశుధ్య పనులు..



కార్యాలయ ముఖద్వారం వద్ద తొలగించిన పిచ్చిమొక్కలు



కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేపడుతున్న శానిటేషన్ సిబ్బంది


సాక్షి
కలెక్టరేట్‌లో పారిశుధ్య లోపం..
సాక్షి ఎఫెక్ట్...

సాక్షిలో ప్రచురితమైన కథనం

కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాల వద్ద చెత్త పేరుకుపోవడంపై సాక్షిలో ‘కలెక్టరేట్‌లో పారిశుధ్య లోపం’ శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టరేట్ ముఖద్వారం నుంచి అన్ని రహదారుల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్త,చెదారాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం